క్లుప్తంగా

ఘనంగా శోభాయాత్ర



మద్దిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప, భవానీ మాలధారులు

పద్మనాభం: మద్ది గ్రామంలో శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో అన్నదానం ప్రారంభించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా అయ్యప్ప, భవానీ మాలధారులు బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. ట్రాక్టర్‌పై అయ్యప్ప స్వామి విగ్రహం ఏర్పాటు చేసి గోస్తనీ నది వరకు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు రంగులు జల్లుకుని, గోస్తనీ నదిలో స్నానమాచరించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, గురు స్వామి సామవేదం బదిరికా వాసు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, భక్తులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం పరిధి కాపులదిబ్బడపాలెం వద్ద శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు భూమి పూజ చేశారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. నాయకులు మేరుగు చిన్నారావు, వాండ్రాసి సన్యాసిరావు, మరుపల్లి చిన్నారావు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు రమణ మృతికి సంతాపం



రమణ (ఫైల్)

తగరపువలస: ప్రముఖ పౌరాణిక నటుడు, భజన బృందాల గురువు అరటికోట్ల రమణ వృద్ధాప్యం కారణంగా చికిత్స పొందుతూ మంగళవారం జీవీఎంసీ రెండో వార్డు సంతపేట కుమ్మరివీధిలో మరణించారు. 1983 నుంచి ఇప్పటి వరకు నాటక రంగంలో హరిశ్చంద్రుడు, అర్జునుడు పాత్రలు పోషించిన రమణ మరణం కళారంగానికి తీరని లోటని శ్రీ విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ అప్పారావు విచారం వ్యక్తం చేశారు. కళాభారతి ఔత్సాహిక కళాకారుల సంఘం అధ్యక్షుడు అల్లు బాబూరావు మాట్లాడుతూ నాటక రంగానికి సరస్వతి వాక్కు కలిగిన రమణ కళామతల్లి ఒడికి చేరారన్నారు. వీరితోపాటు రమణ భౌతికకాయానికి ప్రధాన కార్యదర్శి మనుకొండ సత్యారావు, రెయ్యి అప్పన్న, కనకల ఎర్రిబాబు, పిట్ట తోటయ్య బుధవారం నివాళులర్పించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ అంతరాయం కారణంగా ఆదర్శనగర్, కొత్తపేట, గణేష్ థియేటర్ రోడ్డు, సప్తగిరి లే అవుట్, మీ సేవ డౌన్, సంతపేట, గొల్లవీధి, బాలాజీనగర్, కొండపేట, వలందపేట, సంగివలస, నమ్మివానిపేట, ఊళ్లపేట, ఇడదానరిపేట, ఊళ్లపేట, తగరపువలస మెయిన్‌రోడ్డు, భీమిలి మండల పరిధిలో తాటితూరు, మజ్జివలస, లక్ష్మీపురం, నారాయణరాజుపేట, శింగనబంద, అవంతి, ఓక్రిడ్జ్ విద్యాసంస్థల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

అర్హులందరికీ నిష్పాక్షికంగా పథకాలు

- వైఎస్సార్ సీపీ కార్యక్రమాలకు అపూర్వ స్పందన
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి



జీవీఎంసీ 7వ వార్డు శ్రీకృష్ణనగర్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అర్హులందరికీ నిష్పాక్షికంగా సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ, డీబీటీ ద్వారా అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అన్ని రకాల కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం బుధవారం జీవీఎంసీ 5, 7 వార్డుల్లోని శివశక్తినగర్, మధురవాడ కృష్ణానగర్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, 7వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావుతో కలిసి సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు, వైఎస్సార్ సీపీ పతాకం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే', 'జగనన్న సురక్ష', 'గడప గడపకూ మన ప్రభుత్వం' వంటి ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ఆదరణ ప్రతిబింబించేలా అందరూ ఆశీర్వదించాలని కోరారు.

- జీవీఎంసీ 7వ వార్డులో క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లా సూరిబాబు, ఎస్.బాజ్జీ, పీవీజీ అప్పారావు, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, జగ్గపిల్లి నరేష్, వాసు, ఎల్లాజీ, రామిరెడ్డి, వెంకటరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే సీఎం కావాలి

పీఎం పాలెం: పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరలా సీఎం కావాలని ప్రజలు ముక్తకంఠంతో అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ ఆరో వార్డు 44వ నంబరు సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వార్డు కన్వీనర్ గాదె రోశిరెడ్డి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్నారని కొనియాడారు. బొట్ట అప్పలరాజు మాట్లాడుతూ మరలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గతంలో ఏ రాజకీయ పార్టీ నాయకులూ ఇంతలా ప్రజా సంక్షేమం కోసం పాటుపడలేదన్నారు. సీఎం జగన్ దయతో పిల్లలను నిశ్చింతగా చదివించుకుంటున్నామన్నారు. అనంతరం సంక్షేమ పథకాల ఫ్లెక్సీ, వైఎస్సార్ సీపీ పతాకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోతిన సూరిబాబు, వీవీ నరసింహమూర్తి, జామి శివకుమార్, పిట్టా రామకృష్ణ, వెంకటేశ్వర్లు రెడ్డి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో సృజనాత్మకత వెలికితీత



భీమిలి డైట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి వాసురాజు



రాయపాలెం విద్యార్థులు చిరుధాన్యాలతో చేసిన తినుబండారాలు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న గిరిబాబు, రాంబాబు

పద్మనాభం: విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత దాగి ఉంటుందన్నారు. విద్యార్థులు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాలుపంచుకున్నప్పుడే సృజనాత్మకత పైకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, డీసీఈ బోర్డు కార్యదర్శి ఎం.వి.కృష్ణకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి శాస్త్రవేత్త కావాలి

తగరపువలస: ప్రతీ విద్యార్థి శాస్త్రవేత్త అయ్యేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. భీమిలి డైట్ ఆవరణలో బుధవారం మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలతో పోలిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వసతులు కల్పించారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సౌకర్యాలు కల్పించారన్నారు. ఎంపీడీవో పి.జానకి మాట్లాడుతూ పరస్పరం విద్యార్థులు తమ అనుభవాలు పంచుకోవడం ద్వారా విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు సోమయాజులు, మాధవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఉపాధ్యాయుల తరపున రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు బి.శైలజ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివరాణి, జయప్రద, ప్రధానోపాధ్యాయులు సన్యాసినాయుడు, జయంతి రాధా కుమారి, గాడు పైడిరాజు, మురళీమోహన్, సతీష్, కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేషబాబు, నాయకులు పాట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, రాజగిరి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులపాలెంలో ఆక్రమణ తొలగింపు



ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన ఇంటి వద్ద రెవెన్యూ సిబ్బంది

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ పరిధి ఏనుగులపాలెంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఇక్కడి సర్వే నంబరు 317లో కొంత స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తున్న విషయం పద్మనాభం రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుతో కూడిన రెవెన్యూ అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. అనంతరం ఆర్‌ఐ కోటేశ్వరరావు పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాలను తొలగించి, స్థలం స్వాధీనం చేసుకున్నారు.

లూక్స్ ప్రాంగణంలో ఆక్యుపంక్చర్ శిబిరం



ఆక్యుపంక్చర్ నిర్వహిస్తున్న వైద్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల యోగా, వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం ఉచిత ఆక్యుపంక్చర్, నేచురోపతి శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కాస్మిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందజేశారు. యోగా గురువు కొండా శ్రీధర్ మాట్లాడుతూ మందులు, ఇంజక్షన్ల అవసరం లేకుండా రోగాలు తగ్గించడమే ఆక్యుపంక్చర్ వైద్యం ముఖ్య లక్షణమని తెలిపారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ యోగా వెల్‌నెస్ సెంటర్ డైరెక్టర్లు పీటర్‌సన్ లూక్, రతన్ లూక్, తదితరులు పాల్గొన్నారు.

అణుశక్తి విభాగం సమావేశం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌ఎమ్ యూసఫ్

కొమ్మాది: భారత అణుశక్తి విభాగానికి అనుబంధంగా గల బోర్డు ఆఫ్ రీసెర్చ్ ఇన్ న్యూక్లియర్ సైన్సెస్ ఆధ్వర్యంలో సాలిడ్ స్టేట్ ఫిజిక్స్‌పై 67వ వార్షిక సమావేశాలు గీతంలో బుధవారం ప్రారంభమయ్యాయి. బార్క్ ఫిజిక్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎమ్.యూసఫ్ మాట్లాడుతూ విశాఖలో బార్క్ నెలకొల్పుతున్న అణు పరిశోధన కేంద్రం దేశంలోనే అతిపెద్దదని, కేంద్రం ద్వారా క్వాంటం ఫొటోనిక్స్ వంటి అంశాలపై అధ్యయనాలు జరపనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది అణు శాస్త్ర పరిశోధకులు పాల్గొన్నారు.

కౌశల్ పోటీల విజేతలు వీరే..

విశాఖ విద్య : కౌశల్-2023 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం కౌశల్ కో-ఆర్డినేటర్ పి.త్రినాథ మూర్తి జిల్లా విజేతలను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రతిభాన్వేషణ వెలికితీసే క్రమంలో కౌశల్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానం. పెదనరవ బీసీ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు రెండో స్థానం, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానంలో కె.హరికోమల(చిట్టివలస జెడ్పీ స్కూల్), రెండో స్థానంలో ఎస్.ఎస్.లింకేష్ (బీసీ వెల్ఫేర్ స్కూల్ పెదనరవ), మూడో స్థానంలో సీహెచ్.ధనలక్ష్మి(చిట్టివలస జెడ్పీ స్కూల్) ఎంపికయ్యారు. ఈ మేరకు విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర అకడమిక్ కో-ఆర్డినేటర్గా శ్రీనివాసరావు పోటీలను పర్యవేక్షించారు.

తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టండి



రేవళ్లపాలెంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై టీడీపీ, సినిమా పార్టీ వాళ్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలను అందరూ తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం (పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ వెనుక)లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు ప్రజలు విశేషంగా స్వాగతం పలికారు.

రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, వీధిలైట్లు, తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు టీడీఆర్ సమస్య వారం రోజుల్లో పరిష్కారమవుతుందని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న, నిబద్ధత కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అటువంటి నాయకునిపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపట్ల ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 6వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి బొట్ట అప్పలరాజు, జేసీఎస్ కన్వీనర్ గాదే రోశిరెడ్డి, 7వ వార్డు ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ పిల్లా రమణబాబు, వాండ్రాసి సూరి అప్పారావు, పోతిన మూర్తిబాబు, ఎం.చలపతిరావు, ఎస్.బాబ్జీ, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

భీమునిపట్నం: భీమిలి సౌమ్యగిరిపై గల శ్రీలక్ష్మీ నర్శింహస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు బుధవారం తెలిపారు. ఆ రోజు స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, ఉదయం 4 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని తెలిపారు.

దివ్యాంగుల పరికరాలకు రిజిస్ట్రేషన్ నేడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని మొదటి నాలుగు వార్డుల్లో గల దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం రిజిస్ట్రేషన్ కార్యక్రమం చిట్టివలస బంతాట మైదానంలో గురువారం ఉదయం చేపట్టనున్నారు. ఆర్టిఫిషియల్ లిమ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా – హైదరాబాద్ సౌజన్యంతో రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. తర్వాత అవసరమైన పరికరాలు అందజేస్తారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులంతా వినియోగించుకోవాలని భీమిలి జెడ్సీ బి.రాము కోరారు.

'అందరి నోట ఘంటసాల పాట' రేపు

బీచ్ రోడ్డు: సినీ గాయకుడు ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అందరి నోట ఘంటసాల పాట పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల, అమ్మజమ్మ ట్రస్ట్‌ల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం రామ్‌నగర్‌లోని తర కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంగీత విభావరి జరగనుందన్నారు. ప్రముఖ గాయకులు పీవీ రమణ, కె.రాజేంద్రప్రసాద్, బి.ఫణిభూషణ్, కె.ఎస్.ప్రకాష్, కల్యాణి, శ్రీవిద్య, మంగవేణి, తదితరులు మధుర గీతాలు ఆలపించనున్నారన్నారు. ట్రస్ట్ సభ్యులు చెన్నా తిరుమలరావు, రాజు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



వుడా కాలనీ - వాంబే కాలనీ రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్ వైరు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ – వాంబే కాలనీ రోడ్డులో ఉన్న సెంటర్ లైటింగ్ విద్యుత్ వైర్లు నేలపైనే నిర్లక్ష్యంగా పడేసి ఉన్నాయి. ఈ స్తంభాలకు వుడా కాలనీ, సుద్దగెడ్డ, పాత మధురవాడకు వెళ్లే దారిలో ఫ్యూజు బాక్సులు కూడా చేతికి అందేంత ఎత్తులో నెలలు తరబడి తెరిచి ఉన్నాయి. ఈ వైర్లుపై ఉన్న ప్లాస్టిక్ తొడుగు ఏమాత్రం చెదిరినా పెను ప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి. – డి.దుర్గాప్రసాద్, వాహనదారుడు.

త్వరలో సబ్ ట్రెజరీ కార్యాలయం తరలింపు



సబ్ ట్రెజరీ కార్యాలయం తరలించనున్న మున్సిపల్ చౌల్ట్రీ

భీమునిపట్నం: భీమిలి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని అధికారులు త్వరలో మెయిన్‌రోడ్డులో ఉన్న మున్సిపల్ చౌల్ట్రీలోకి తరలించనున్నారు. బ్రిటిష్ కాలంలో 1861లో వారు తహసీల్దార్ కార్యాలయం కోసం భవనం నిర్మించగా అందులో వెనుక వైపు ట్రెజరీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తుండగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అందులోనే కొనసాగుతోంది. కాగా ఈ మొత్తం భవనం బాగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో దీని పక్కన కొత్త భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. కానీ అందులో ఆర్‌డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పుడు మరో కొత్త భవనాన్ని నిర్మించే సమయం లేకపోవడంతో గతంలో 'మీ సేవ' కార్యాలయం నిర్వహించిన చౌల్ట్రీలోకి తరలించనున్నారు. దీనికి సంబంధించి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా ఆర్‌డీవో కార్యాలయం మేడపైకి తరలించనున్నారు.